క్లుప్తంగా

అంగన్‌వాడీ సిబ్బందికి సెలవులు మంజూరు చేయండి


సీడీపీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెనుకొండ: అంగన్‌వాడీ సిబ్బందికి వేసవి సెలవులు మంజూరు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు బుధవారం సీడీపీఓ శాంతలక్ష్మికి వినతిపత్రం అందించారు. ప్రాజెక్టు పరిధిలోని పెనుకొండ, రొద్దం మండలాల్లో వేసవి కాలంలో చిన్నారులు, వర్కర్లు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. నాయకులు రమేష్, శ్రీరాములు, శీలా నారాయణస్వామి, జాఫర్‌వలి పాల్గొన్నారు.

నేడు 'కాఫీ విత్ వైఎస్సార్ సీపీ'

పెనుకొండ రూరల్: దుద్దేబండ గ్రామంలో గురువారం ఉదయం 6 గంటలకు కాఫీ విత్ వైఎస్సార్ సీపీ కార్యక్రమం జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

సర్వే పనులు నిలిపివేయాలి

పెనుకొండ రూరల్: భూ సర్వే పనులను నిలిపివేయాలని ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు రైతు సంఘం నాయకులు విన్నవించారు. నాయకులు మాట్లాడుతూ మడకశిర మండంలోని సి.కొడిగేపల్లి, కేతేపల్లి గ్రామాల్లో 20 ఏళ్ల క్రితం రసాయి సంస్థ ప్రతినిధులు పరిశ్రమ నిర్మిస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని రైతుల నుంచి తక్కువ ధరకే భూములు కొన్నారన్నారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు రీ సర్వే పేరుతో గ్రామాల్లోకి వచ్చి రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. సమస్య పరిష్కామయ్యే వరకూ సర్వే పనులు నిలిపివేయాలని వారు కోరారు. నాయకులు హరి, బాబావలి, నరసింహ, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

హిందూపురం టౌన్: పట్టణంలో పాలిసెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ, స్క్వాడ్ గంగప్ప, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని బాలా జీ డిగ్రీ కళాశాల, బాలయేసు డిగ్రీ కళాశాల, బాలయేసు జూనియర్ కళాశాల, సప్తగిరి డిగ్రీ కళాశాల, ఎంజీఎం పాఠశాలలో పాలిసెట్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,859 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,588 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 271 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. కేంద్రాలను ఎంఈఓ గంగప్ప పరిశీలించారు.

మహాకవి శ్రీశ్రీ జయంతి

చిలమత్తూరు: మహాకవి శ్రీశ్రీ సాహిత్యానికి వన్నె తెచ్చిన మహనీయుడని ప్రముఖ కవి , తపన సాహిత్య వేదిక నిర్వాహకుడు సడ్లపల్లె చిదంబర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు హిందూపురం టీచర్స్ కాలనీలోని తపన సాహిత్య వేదిక కార్యాలయంలో మహాకవి శ్రీశ్రీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో అ.ర.సం అధ్యక్షుడు సిద్దగిరి శ్రీనివాస్, కార్యదర్శి గంగాధర్, విశ్రాంత ప్రిన్సిపాల్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

ఏడీజే కోర్టు తరలింపు సరికాదు


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ నాయకులు

హిందూపురం అర్బన్: పట్టణంలోని అదనపు జిల్లా కోర్టును పెనుకొండకు తరలించే యత్నాన్ని విరమించుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వన్నూరప్ప, న్యాయవాదులు ఇందాద్, రత్నకుమార్, ఉదయ్ సింహారెడ్డి, రామచంద్రన్, కృష్ణమూర్తి, కదిరీష్ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయించారన్నారు. ఇప్పుడు జిల్లాలో ఉన్న మంత్రి ఇక్కడి ఏడీజే కోర్టును, జిల్లా కోర్టును పెనుకొండలో ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్‌టీ రామారావు తీసుకొచ్చిన ఏడీజే కోర్టును తరలించడం సరికాదని న్యాయవాదులు అన్నారు. హిందూపురంలోనే జిల్లా కోర్టు కొనసాగేలా, జిల్లా కోర్టును కూడా ఏర్పాటు చేయించడంలో ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపాలని కోరారు.

సీనియర్ సివిల్ జడ్జిగా వెంకటేశ్వర్‌నాయక్

హిందూపురం అర్బన్: హిందూపురం సీనియర్ సివిల్ జడ్జిగా డి.వెంకటేశ్వర్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న మానిపాటి శ్రీధర్ శ్రీకాకుళానికి బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో పని చేస్తున్న డి.వెంకటేశ్వర్ నాయక్ హిందూపురం సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వచ్చారు. అనంతరం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజను వెంకటేశ్వర నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు సీనియర్ సివిల్ జడ్జిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు కార్మికుల దినోత్సవం

అమరాపురం: మండల కేంద్రంలో గురువారం ఉదయం కార్మికుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు అసంఘటిత కార్మికుల సంఘం నాయకురాళ్లు అనసూయ, నాగమణి తెలిపారు. ఈ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో తరలి వచ్చి, విజయవంతం చేయలాని కోరారు.

భక్తిశ్రద్ధలతో బసవ జయంతి


హిందూపురంలో వీధుల గుండా వెండిరథంపై బసవేశ్వరుడిని ఊరేగిస్తున్న దృశ్యం


మధూడిలో వృషభాలను అలంకరించిన దృశ్యం


బసవన్న వేషధారణతో వీరగాశి నృత్య ప్రదర్శన

హిందూపురం: పట్టణంలోని మధుర మీనాక్షి కళ్యాణ మండపంలో బసవ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. శరణ బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లికార్జున, వీరభద్రప్ప, ఉమేష్, సంపత్‌కుమార్ వీరశైవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.
ఘనంగా వెండి రథంపై ఊరేగింపు: సాయంత్రం బసవేశ్వరుడి ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. బెంగళూరురోడ్డు నుంచి మెయిన్ బజారు మీదుగా పుర వీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో బసవన్న వేషధారణతో వీరగాశి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.
హిందూపురం: పట్టణంలోని మెయిన్‌బజారులోని బసవేశ్వరాలయంలోశివలింగం,బసవేశ్వరులకు బుధవారం పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతం, రుద్రాభిషేకాలు నిర్వహించి, అలంకరించి అర్చనలు, పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు మల్లికార్జున, వీరభద్రప్ప, ఉమేష్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



జ్యోతుల ఊరేగింపు

మడకశిరరూరల్: ఆమిదాలగొంది గ్రామంలో బుధవారం బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులతో ఊరేగింపు చేపట్టారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి జ్యో తులను సమర్పించారు. ప్రత్యేక పూజలనంతరంప్రసాదం అందజేశారు.
గుడిబండ: మండల పరిధిలోని ఫళారం, గుడిబండ తదితర గ్రామాల్లో బుధవారం బసవేశ్వర జయంతి వేడుకలు జరిగాయి. జంగమ, వీరశైవ లింగాయితులు ఉదయాన్ని బసవేశ్వర స్వామి మూల విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం వెండి, బంగారు ఆభరణాలతో స్వామిని అలంకరించి, మహామంగళారతి ఇచ్చారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు.
మడకశిర: పట్టణంలో బుధవారం బసవ జయంతిని ఘనంగా నిర్వహించారు. బసవేశ్వర స్వామి ఆలయంలో వీరశైవ లింగాయితులు ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు వివిధ అభిషేకాలు, అర్చనలు చేపట్టిన అనంతరం బసవేశ్వర స్వామికి జ్యోతులను సమర్పించారు.కార్యక్రమంలో వీరశైవ లింగాయితుల సంఘం నాయకులు పాల్గొన్నారు.
అమరాపురం: మండల కేంద్రంలో బుధవారం బసవ జయంతిని జరుపుకున్నారు. వీరశైవ లింగాయతుల ఆరాధ్య దేవుడు బసవన్నకు అభిషేకాలు, అర్చకులు చేశారు. పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో బసవన్న చిత్రపటానికి పూజలు చేశారు.
పావగడ: వీర శైవుల ఆరాధ్య దైవమైన బసవేశ్వర స్వామి జయంతి వేడుకలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వరద రాజు బసవేశ్వరుడి చిత్రపటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు.
అగళి: మధూడి గ్రామంలో బుధవారం సాయంత్రం బసవ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎద్దులు, ఆవులను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. ఇంటింటికీ తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.


మడకశిర: అలంకరణలో బసవేశ్వర స్వామి


అమరాపురంలో బసవన్న చిత్రపటానికి పూజలు


పావగడ: తహసీల్దార్ కార్యాలయంలో..


అమరాపురంలో అన్నదానం చేస్తున్న యువకులు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

గుడిబండ: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యర్తలు, అభిమానులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. బుధవారం అగళి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఫళారం గ్రామంలో ఈరలక్కప్పను మర్యాదపూర్వకంగా కలిసి, పూలమాలతో సన్మానించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్న సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఎన్ని మాయమాటలు చెప్తారని ఎద్దేవా చేశారు. హామీలను నెరవేర్చకపోతే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధైర్య పడకుండా ఉండాలని భరోసా కల్పించారు. వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.


ఈరలక్కప్పను కలిసిన అగళి మండల నాయకులు

మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం గ్రామీణులకు వరం

రొళ్ల: గ్రామీణ ప్రాంతంలో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం హర్షణీయమని పట్టనాయకనహళ్లి (స్ఫటికపురి) కుంచిటి వక్కలిగ సంస్థానం, శ్రీగురుగుండ బ్రహ్మేశ్వరస్వామి మఠాధిపతి నంజావధూత మహాస్వామిజీ పేర్కొన్నారు. బుధవారం కొత్తపాళ్యం (కొత్త తిరుపతి)లోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు ఆధ్వర్యంలో శ్రీదేవి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామికి వేదపండితులు కల్యాణం జరిపించారు. ఆలయ సమీపంలో కేటీడీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి నంజావధూత స్వామిజీ భూమిపూజ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కేటీడీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం హర్షించదగిన విషయమని తెలిపారు. తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

3న వాసవీమాత చరవిగ్రహం ఆవిష్కరణ

హిందూపురం టౌన్: పట్టణంలోని వాసవీమాత ఆలయం నిర్మించి 45 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 3న చర విగ్రహ ఆవిష్కరణ చేస్తున్నట్లు స్థానిక ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జేపీకే రాముతో పాటు సంఘం కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు, సంఘం ప్రతినిధులు దొంతి మహేశ్, ప్రకాశ్, అనంత్, సీఆర్ మోహన్, పార్థసారథి విలేకరులతో మాట్లాడా రు. దాతల సహకారంతో రెండున్నర కిలోలతో తయారు చేయించిన సువర్ణ వాసవీమాత చర విగ్రహం దక్షిణ భారతదేశానికే తలమానికమన్నారు. వాస వీమాత జయంతి సందర్భంగా గురువారం నుంచి ఈనెల 7 వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. 3న మధ్యాహ్నం 800 మంది మహిళలకు ఒడి బియ్యం, 4న కుసుమ పుత్రిక మహిళా మండలి వారితో 102 రకాల పిండివంటలో అమ్మవారికి నైవేద్యం, 7న ఉదయం ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, వాసవీమాత జయంతి జరుగుతుందన్నారు.

ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలి

హిందూపురం టౌన్: ఆర్‌డీటీ సేవలను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో పీడీఎస్‌యూ నాయకులు సమావేశం నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్, నరేష్, గోవిందు, హరి, నాగేంద్ర, దర్శన్, రోహిత్, సోమశేఖర్, నిరంజన్, అజయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.
ఆర్డీటీ సేవలు ఎనలేనివి: అనంత కరువు నివారణలో ఆర్‌డీటీ కృషి ఎనలేనిదని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో ఆర్డీటీ సేవలను పునరుద్ధరించేలా కేంద్రం ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ అఫ్రీద్, అజ్మల్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బాబా, గుల్మన్, మహీర్, కౌశిక్, రాజిక్, షాహిద్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని చెరువులన్నీ నింపాలి

పెనుకొండ: నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపి లైనింగ్ పనులు ఆపాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వేదిక నాయకులు పట్టణంలోని మిట్టాంజనేయస్వామి దేవాలయ ఆవరణలో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. శ్రీనివాసులు అధ్యక్షతన కార్యదర్శి ఊటుకూరు నాగరాజు నేతృత్వంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్ర అభివృద్ధికి సాధన కమిషన్ వేయాలని, తక్షణం హంద్రీనీవా కాలువ ప్రారంభం నుంచి ఇక్కడి వరకూ 11 వేల క్యూసెక్కుల నీరు వచ్చేలా కాలువ వెడల్పు చేయాలన్నారు. అప్పటి వరకు లైనింగ్ పనులు ప్రారంభించకూడదని, పరిశ్రమల కోసం స్థాపించిన భూముల్లో పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. గొల్లపల్లి నుంచి తాగు నీటిని పెనుకొండ పట్టణ ప్రజలకు మరింత సౌలభ్యంగా అందించాలన్నారు. అదే విధంగా మెడికల్ కళాశాల పనులు వెంటనే ప్రారంభించి వేగవంతం చేయాలని కోరారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని పలు విషయాలను నాయకులు చర్చించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, నిజమల్లిబాబు, రాజశేఖరరెడ్డి, క్రిష్టఫర్, సిరాజుద్దీన్, అశ్వత్థనారాయణ, సద్దాం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

కనిపించని అక్షయ తృతీయ సందడి

అమరాపురం: అక్షయ తృతీయ సందర్భంగా అమరాపురంలోని పలు నగల దుకాణాలు బోసిపోయాయి. గత సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది అంతా సందడి కనిపించలేదు. అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోలు చేస్తే సంపద మరింత పెరుగుతుందని ప్రజల విశ్వాసం. అయితే ఈ సారి కేవలం వెండి ఆభరణాలు కొనుగోలు చేశారు. ముఖ్యంగా బంగారం ధరలు పెరగడమే కారణం. గతంలో జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 45 సంవత్సరాలు నిండిన వారికి రూ.18,500, అమ్మ ఒడి కింద రూ.15 వేలు, రైతు భరోసా రూ.13,500 సాయం చేశారు. ఇలా అనేక పథకాలు అందడంతో ప్రజలు అవసరాలు తీర్చుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క పథకం కూడా అమలు చేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


అమరాపురంలోని ఓ దుకాణంలో ఉన్న మహిళలు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మడకశిర రూరల్: మండల పరిధిలోని ఈ అచ్చంపల్లి, టీడీపల్లి తండా అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా, బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.


పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరిస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. బాలింతలు, గర్భిణులు ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. అదే విధంగా బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు.

గర్భిణుల్లో రక్త హీనత నివారణ ఐసీడీఎస్ లక్ష్యం
గోరంట్ల: గర్భిణుల్లో రక్త హీనత నివారించడమే లక్ష్యంగా ఐసీడీఎస్ పనిచేస్తుందని సూపర్‌వైజర్ రజిత అన్నారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా గోరంట్ల ఉర్దూ పాఠశాలలో బుధవారం కార్యక్రమం నిర్వహంచారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు జాన్‌రెడ్డప్ప, గోపాల్, అంగన్‌వాడీ వర్కర్లు, ఉపాధ్యయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట
గోరంట్ల: బోందూరివాడ్లపల్లి లో బుధవారం గ్రామస్తులు ఆంజనేయస్వామి పునఃప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దాతల సహకారంతో ఆంజనేయ స్వామి దేవాలయాన్ని నూతనంగా నిర్మించారు. మూడు రోజుల నుంచి ప్రతిష్ట నిర్వహించారు. ఎంపీ పార్థసారథి హాజరై పూజలు చేశారు.

సన్మానం
మడకశిర: స్థానిక ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న ఉద్యోగి శ్రీనివాసమూర్తి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. డిపోలో ఆయన్ను ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, ఎన్ఎంయూ, ఈయూ నాయకులు, గ్యారేజ్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆర్టీసీ కార్మికులు శ్రీనివాసమూర్తిని ఆదర్శంగా తీసుకుని విధులు నిర్వర్తించాలని పలువురు సూచించారు.

గోరంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విస్తరణ అధికారి గా పనిచేస్తున్న శివన్న బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మండలంలోని ప్రజాప్రతినిధులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు
హిందూపురం : ఎస్.సడ్లపల్లిలోని పురాతన ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం అక్షయ తృతీయను పురస్కరించుకొని ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ ఆంజనేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, పురోహితుల మంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాల నడుమ వందలాది మంది భక్తులు సమక్షంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శివారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, లింగారెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖరరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

వేంకటరమణుడికి చందన అలంకరణ
హిందూపురం: పట్టణంలో ప్రముఖ ప్రసిద్ధ పేట వేంకటరమణ స్వామి ఆలయంలో బుధవారం అక్షయ తృతీయను పురస్కరించుకొని మూలవిరాట్ వేంటరమణస్వామికి విశేష ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించి, అనంతరం చందన లేపనంతో అలంకరించారు. సాయంత్రం పూజల అనంతరం ఉత్సవమూర్తులను ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

18 వరకు ప్రత్యేక తరగతులు
లేపాక్షి: పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు లేపాక్షిలోని నీలం సంజీవరెడ్డి ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు లాంగ్వేజీల విద్యార్థులు, రెండోరోజు నాన్ లాంగ్వేజి విద్యార్థులు మాత్రమే హాజరుకావాలన్నారు. ఈనెల 18వ తేదీ వరకు తరగతులు జరుగుతాయన్నారు.

పుట్ట గొడుగుల పెంపకం లాభదాయకం
మడకశిర: పుట్ట గొడుగుల పెంపకం చాలా లాభదాయకమని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పుట్ట గొడుగుల పెంపకంపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. సిల్క్ హబ్ శిక్షణలో భాగంగా సేంద్రీయ పద్ధతిలో పుట్ట గొడుగులను ఎలా పెంచాలో రీసోర్స్‌పర్సన్ భాస్కర్ వివరించారు. మొదటి విడతలో రెండు నెలల పాటు శిక్షణ తీసుకున్న విద్యార్థులు పండించిన పుట్ట గొడుగులను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ నాగసాయి ప్రసాద్, కో-ఆర్డినేటర్ హుసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తో భేటీ


వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి

మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు నితిన్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీటీకి సంబంధించిన ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ విషయాన్ని వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను వైఎస్ జగన్ అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు ఆనంద రంగారెడ్డి తెలిపారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని.. అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారని పేర్కొన్నారు.

నాగముని సేవలు మరువలేనివి


నాగముని దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలో ఈఓఆర్డీగా విధులు నిర్వర్తిస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన నాగముని సేవలు మరువలేనివని ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ రామరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ నాగమునికి వీడ్కోలు సభ నిర్వహించారు. ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు మాట్లాడారు. అనంతరం నాగముని, ఓబలమ్మ దంపతులను శాలువా, పూలమాలలతో సన్మానించారు.

అర్హులకు పథకాలు అందజేయాలి

పావగడ: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన గృహ లక్ష్మి పథకం కింద మహిళలకు అందిస్తున్న రూ.2 వేల నగదును అర్హులైన మహిళలకు క్రమం తప్పకుండా అందజేయాలని స్త్రీ, శిశు అభివృద్ధి యోజనాధికారి రఫీక్‌కు తాలూకా గ్యారంటీ నిర్వహణ సమితి అధ్యక్షుడు కేఎస్ పాపణ్ణ సూచించారు. బుధవారం స్థానిక తాలూకా సమితి మీటింగ్ హాల్‌లో సమితి పదాధికారుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గృహ లక్ష్మి నగదు అందని అర్హులైన లబ్ధిదారుల వివరాలు సేకరించి నివేదికను సమితికి అందించాలని అంగనవాడీ కార్యకర్తలకు సూచించారు. తాలూకాలోని అన్ని చౌక ధాన్యపు డిపోల్లో అన్న భాగ్య పథకం సరిగా అమలు చేయాలని తెలిపారు. గుమ్మఘట్ట, ఆర్‌జడి రొప్ప, బూది బెట్ట, సింగరెడ్డిపల్లితో పాటు అనేక చోట్లకు రవాణా వ్యవస్థ కల్పించాలని సూచించారు. గృహ జ్యోతి, యువ నిధి పథకాలపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. గ్యారంటీ అమలు సమితి సభ్యు లు గుమ్మఘట్ట శ్రీనివాసులు, రంగేగౌడ, వీరాంజనేయులు, అధికారులు పాల్గొన్నారు.

కరియమ్మ ఆలయ ప్రారంభోత్సవం

పావగడ: తాలూకాలోని కొత్తూరు గ్రామంలో వెలసిన కరియమ్మ దేవి, కట్టి మారక్క దేవి నూతన దేవాలయాలను స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ బుధవారం ప్రారంభించారు. అదే విధంగా దేవతల నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో కొలువుదీరిన కరియమ్మ, కట్టి మారక్క దేవతలను దర్శించుకుని పూజలు చేయించారు. ఆలయ సమితి పదాధికారులు ఎమ్మెల్యే వెంకటేశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు కోటి ప్రభాకర్, కొండప్ప, నాగేశ్, బిందు మాధవ్ రావ్, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన తప్పనిసరి


తురకలాపట్నంలో పౌరహక్కులపై తెలియజేస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగులో రెవెన్యూ అధికారులు, హక్కుల గురించి అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో ఉండాలన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి రాజ్యాంగం హక్కులు కల్పించిందన్నారు. తహసీల్దార్ శ్రీధర్, వీఆర్వో బాల పెద్దన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
సోమందేపల్లి: అన్ని వర్గాల ప్రజలు గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ రమేష్ బాబు సూచించారు. బుధవారం సాయంత్రం పందిపర్తిలో పౌర హక్కులపై అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, ఏఎస్ఐ నారాయణ స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.
రొద్దం: తురకలాపట్నంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు పోలీసులు, రెవెన్యూ, ఆరోగ్య శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం పంచాయితీ పరిధిలోని మద్దిపి ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. డీటీ కుమార్‌స్వామి రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ షర్ఫుద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీళమ్మ, వీఆర్ఓ గంగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.
అమరాపురం: గ్రామాల్లో పౌరులు ప్రశాంతంగా జీవించాలని తహసీల్దార్ లక్ష్మీ నరసింహ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వలస ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు.
అగళి: పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సుబ్బరావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆలూడి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్ఓ నరసింహమూర్తి, నగేంద్ర, రాజు, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.
గుడిబండ: మండల పరిధిలోని జమ్మలబండ ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పౌర హక్కులపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.ఏఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.